తొలికోడి కూసింది

వుప్పల నరసింహం

పొద్దంతా కూలికిపోయొచ్చి, అలసిపోయి ఇంట్లో ఆపనీఈపనీచేస్తున్న బాలమ్మకు ఏతోవెలితిగా తోస్తున్నది. ఏమిటి? అని తలచుకోగానే కోడిపెట్ట స్ఫురణకు వచ్చింది. జిట్టదికోడి- పూలపూలకోడి.... అమ్మో! కోడిఎక్కడపోయింది? ఏమైంది? ఏడున్నది! ఏది? ఏది??.... మనసులోఆరాటం- దాంతో గుండెలు జల్లుమన్నాయి, నరాల్లో రైళ్ళుపరుగెత్తసాగాయి, కడుపులో దడఎక్కువైంది- బుగులుబుగులు.... భయంభయం.... కాళ్ళంవణుకుతుంది.... చెమటలుపడుతున్నాయి. ఇంకవేరే ఏమీఆలోచించలేకపోయింది- కంగారుగా అటూఇటూ తిరిగింది.

ఎందుకూ? అంటే అది ఆపూరిదొరకోడి- దొర పెంచడానికి ఇచ్చినకోడి- 'దొరకోడిపోయిందంటే ఇంకేమైనాఉందా? మీదిప్రాణాలు మీదనేపోతయ్, ప్రాణాలన్నానమ్మలంగపోతయా? ఎంతగోసనో? ఎంతబాధనో? ఏం కథనో? ఎన్నితిట్లో యిగఏంచేతురోతండ్రీ....' అనుకుంటూ బాలమ్మ పెరట్లోకివెళ్ళింది.

పిడకల కుప్పెనకింద, కట్టెలవాటున, చింతచెట్టుమీద, ఇంటివసాలమీద "ఆఁ....ఆఁ....ఆఁ.... ప్పాప్పాప్పా...."అంటూ ఎక్కడైనా వుందేమోనని పిలుస్తూ వుంది- పెరట్లో కోడిఉలుకులేదు, పలుకులేదు.

"మ్యావ్, మ్యావ్"అంటూ పిల్లి నాలుకతో మూతితుడుచుకుంటూ తిరుగుతూ వుంది- అదిచూసి బాలమ్మకడుపులో 'దగడు' (భయం, ఆందోళన) మరింత ఎక్కువైంది.

'ఆయింత పిల్లిబొందకు పెట్టుకునేనాఏంది?' అనుకుంటూ కోడిబూరు ఎక్కడైన కనబడుతుందేమోనని నిశితంగా పెరడంతావెతికింది. కాని ఎక్కడా ఏమీకనిపించలేదు.

'ఇగనేను ఏంజేతునుల్లో.... శనిఏశం మెడకుగట్టుకున్నట్టాయే.... రోజు ఈ యాళ్ళకు ఇంట్లకొచ్చి గంపకాడ కూసుంటుండే- ఇయ్యాల ఇంకారాకపాయే? ఎవలన్న పట్టుకతిన్నరాఏంది? ఓలమ్మో! ఆకోడిపోతే ఏమున్ననన్నదాఇంత....దొరనానెత్తికొరిగిచ్చి, సున్నంబొట్టుపెట్టి ఊర్లెకేలి ఎలగొడ్తడు. ఎవరింట్ల మున్నవడే, ఎవరిసేతులకు గస్తరలేసే....' అనుకుంటూ బాలమ్మ తిరిగిఇంట్లోకొచ్చింది.

లోపలి అర్రి(గది)లోకూడా చూసింది- బల్లి 'కిస్‌సస్....'అంది గాని కోడి జాడలేదు. బాలమ్మచూపుల్లో, నడకలో ఆందోళనఎక్కువైంది

'ఇదెక్కడి బాదయిపాయెనుల్లో- అడ్డెడొడ్లకూలికిపోతే బుడ్డోళ్ల దుడ్డెమేశ, అన్న శాస్త్రమయిపాయెనూ?.... ఇంటిముంగట ఇంతకోడీ, కుక్కవుంటె అక్కత్

బర్కత్ అనుకుంటే, ఆయింత సన్నతన్ని దాన్నిపట్టుకతిన్నట్టుంది. ఆకోడి నాదైనా పీడపోయిందని ఊకుంటుంటిగదా? బటాయిలెక్క పచేలుఇచ్చే.... రండముండవు, ఇంటిముంగల గొడ్డుగోద ఏమిలేదు, నువ్వు నీకొడుకేగదా? జీట్లకోడిని ఇస్త! తీసుకపోయి బటాయికీసదుపు.... నీకు ఇంటిముంగట కోడివున్నట్టుంటది, నాకు ఇంతబటాయి (ఉత్పత్తిలో భాగం) వొస్తది. దానికి నువ్వుగింజలు బొంజలు ఏమిఎయ్యకున్నానడుస్తది, పెంటమీద అదే ఇన్నిఇత్తులు ఏరుకబుక్కుతది. నువ్వు యాల్లకు చూసిగంపకిందకమ్మి పొద్దుగాలఇడిస్తే అయిపాయే.... ఇండ్ల ఏమంత సుతారంపనుంది? కూసున్నదగ్గర నీకుబటాయివొస్తది. కాని యిమానంతోటి (న్యాయంగ) నడుపు- ఎన్నిగుడ్లుపెడితే అన్నిగుడ్లు పొదిగెయ్యి. నాలుగమ్మి, నాలుగు పొదిగెయ్యకు ఏమంటున్న? అట్లజేస్తివంటే మల్ల ఊర్లెకనిపియ్యవు.... యిమానంతో సాదుకుంటే, నీఅదృష్టం మంచిగుంటే మల్లఈదినంకల్ల నీయింటినిండా కోళ్ళే కోళ్ళపో....' అన్నవిషయం గుర్తుకొచ్చింది. దాంతో మరింత భయంపెరిగింది.

మనసులో సుళ్ళుతిరుగుతూవున్న ఉద్వేగాన్ని అణచుకోలేక, గుండెలనిండా పొంగుకొస్తున్న కోపం, కసితోవీధిలోకివచ్చి

'ఎవలమీదమన్నవోతు? ఎవలింట్ల దుమ్ముపోతు?.... దొరదెగ్గరనుంచి కోడిపెట్టతెచ్చి పదిహేనురోజులుగాకపాయె అప్పుడే దానిమీద ఎవల కన్నుపడెనోఏమో! ఆళ్ళకళ్ళళ్ళ దుమ్మువడ! మన్నువడ!....' అంటూ గుబురుచెట్లచాటున, పొదల చాటున, పాడువడిన గోడలల్లో "ఆఁ....ఆఁ....ఆఁ క్కొ....క్కొ....క్కొ" అంటూ పిలువసాగింది.

కిరసనాయిల్ సీసపట్టుకుని కోమటి దుకాణానికి పోతున్న మదినవ్వ బాలమ్మను చూసి

"ఏంపోయిందొదినే? గట్లదేవులాడుతున్నవు?...." అని అడిగింది. "కోడి పోయిందే! తీసుకొచ్చి పదిహేనురోజులు కాలేదు. అప్పుడే ఎవలింట్ల మన్నువడ్డదో ఏమో? మందిసొమ్ము అపాలిచ్చుకుంటందుకు ఎప్పుడు' వంగి '(అదును) దొరుకుతదా? అనిసూస్తుంటరు, మంది 'రుణంల' బతికెటోళ్ళు.... "కోడికోసం చూస్తానే ఉక్రోషంతోఅంది బాలమ్మ.

"ఎసుంటికోడి?"

"పూలపూలకోడి- మొన్న దొర దెగ్గర తెచ్చినకోడి...."

"అదా!.... ఆ దాదనగరి మల్లవ్వఇంట్ల ఆళ్ళకోళ్ళతోటి వొచ్చిదంట- ఇందాకనే మల్లవ్వ 'ఇది ఎవలకోడుల్లా మాకోళ్ళల్ల వచ్చిపన్నది?' అనిఅడిగింది- అప్పుడే నీ కోడిఅని యాదిరాలేదు వొదినే- 'ఏమో యెవలకోడో ఏమో' అన్న-అడనే ఉండొచ్చు సూడుపో- ఎందుకుఅంత 'హైబత్' తింటవ్? గింత ఏమన్న అయితే ఇంత పెద్దగ జేస్తవ్? ...."అంటూ మదినవ్వ చేతులు తిప్పింది.

కొన్త కుదుటపడ్డ మనసుతో "మరి ఏం జేతునే అది నాఇంటి కోడిఅన్నా గాక పాయె, పోతే ఇంతసేపు తిట్టి ఊకుంతందుకు...."అందిబాలమ్మ.

"నీకు నాకున్నంతఅగడు(ఆశ)- బుడ్డపైసచేతులుంటే పెద్దపైసి చెయ్యాలను కుంటవు. తొవ్వొంటి ఇంతకష్టపైపుల్లకూడ దక్కనియ్యవు, ఇంత పెండ దక్క నియ్యవు." బాలమ్మ పొదుపరితనాన్ని ఎత్తిచూపింది మదినవ్వ- అందులో వ్యంగం కూడా చోటుచేసుకుంది.

"ఏమోనే...."అని ఒక్కమాటలో బాలమ్మ కొట్టేసింది ఆవాదాన్ని.

"మల్లవ్వఇంట్లకు పోయేపటికె అదిదక్కింది- ఇంకోరి ఇంకోరి ఇండ్లళ్ళకు పోతే అణగపడ్తురు. ఈపాటికీ బూరుమిగుల్తుండె" అని "పొయ్యిరాజేశ్నవావొదినే?" అడిగింది.

"ఇంకఏడనే? కూలికేలిరాంగనే ఇదే దేవులాడుడాయే-"

"పోమరి పోయి కోడినితీసుకరాపో- ఇంక నేన్‌గూడ పొయ్యిరాజెయ్యలేదు, కోమటాయనదగ్గర్కి పోయొస్త!...." అంటూ మదినవ్వ ముందుకునడిచింది.

'ఈకోడిఇంట్లపీనుగెల్ల! జెర్రసేపట్ల ఎంతపరేశాన్‌జేసేసూడు. కడుపుల దగడు ఇంకాపోలేదు.... మంచికోడేపుందమ్మ ఏమన్నగాని....' అనుకుంటూ మల్లవ్వ ఇంటికొచ్చింది.

వాకిట్లో మల్లవ్వ బియ్యంగాలిస్తూవుంది.

"మా కోడొచ్చినాది మల్లక్కా?" అంటూ బాలమ్మ పలకరించింది.

"ఎవలకోడోఏమో ? మాకోళ్ళల్ల వచ్చిపన్నది- ఎసుంటిదే నీకోడి?" అంది తనపని కొనసాగిస్తూనే

"పూలపూలది జిట్టకోడి"

"ఆఁ.... గట్లనేవుంది. గా జాంపుకిందవున్నయ్‌సూడు" తలతిప్పిఅంది.

109

అరుగుమీద ఓమూలకు జాంపు కిందకోళ్ళు ఒకదాన్ని ఒకటి పొడుచుకుంటున్నాయి. కయ కయ చప్పుడవుతుంది. బాలమ్మ ఆత్రంగా జాంపులేపట్టింది. మనిషి దగ్గరికి రావడంతో కోళ్ళుబెదిరి చప్పుడుచేస్తూ ఒకదానిమీద ఒకటిపడుతున్నాయి. పక్కపక్క కూర్చుంటున్నాయి. దీపం వెలుతురులో తన పూలపూల జట్టకోడి కనిపించింది. బాలమ్మకు పెద్ద గండం తప్పినట్టనిపించింది. కాని కోడి మీదకోపం వచ్చింది.

'మంచిగున్నవమ్మ. రోజూ ఈడనేవన్నావు? నేన్ ఎంతవగడుతింటి....' అని కోళ్ళమధ్యనుంచి తనకోడిని చేయిపెట్టితీసింది. 'క్కొక్కొక్కొక్కొ' అంటూ కోళ్ళది ఒకటేగోల.

చేతిలో కోడినిపట్టుకుని మల్లవ్వ దగ్గరికివచ్చి "బొయ్యిరాజేసినావ్ అక్కా?" అని బాలమ్మ అడిగింది.

"ఇంకఏడనే పొద్దంత కూలికిపోయి గిప్పుడేవస్తి! ఆ కలుపుపాడుగాను ఇంతింత పెద్దచెల్లు మొలిశినయ్‌చేంగ్ల. అవన్నిపీకెవరకు నాచేతులు 'ఇట్ల'నని స్తరేవు" అంటూ చేతులు పైకిలేపబోయింది, కాని పూర్తిగాపైకిరాలేవు.

"నేన్‌గూడ వొచ్చిఏంపనిచెయ్యలేదు. బొయ్యిల బూడిదిగూడఎత్తలేదు. ఏడున్నపని ఆడనేవుంది." అని చేతిలోనికోడిని చూపిస్తూ "యిగో ఇదింత నన్ను పరేశాన్‌జేసింది. ఇదికన్పియ్యక బొయ్యేటాల్లకళ్ళు నాకడుపులకేలిదగడు లేశింది. దీన్నిదేవులాడెకళ్ళనే గీయాళ్ళయ్యింది. బావలేడాఅక్క, కనిపిస్తలేడు?" అని అడిగింది బాలమ్మ.

"మీబావనా? ఏడ కల్లుదుకాండ్లకూసుండో?" అంటూ లేచిందిమల్లవ్వ.
"యిగనేన్ పోయొస్తఅక్క" అంటూ బాలమ్మ ముందుకుఅడుగేసింది.
"మంచిదిఫో...." అంటూ తనూఇంట్లోకివెళ్ళింది మల్లవ్వ.

బాలమ్మ ఇంటికొచ్చేసరికి కొడుకు శంకరయ్య గోనెతట్టు కొప్పెరపెట్టుకుని, తలపై కట్టెలమోపు పెట్టుకునివొచ్చాడు. తలపైమోపును వాకిట్లో ఓమూలపారేసి, మోపులోని గొడ్డలినిపైకిలాగి, ఇంట్లోకొస్తూ ఇంట్లో దీపంలేకపోవడంచూసి "యింక దీపంపెట్టలేదేమవ్వ" అని అడిగాడు తల్లిని.

"కోడీ దానగరి మల్లక్కఇంట్ల పోయివన్నది. దేవులాడీ దేవులాడీ అక్కడిక్కడ తిర్గేటాకళ్ళ పొద్దుపోయిందిబిడ్డా...." అని గూట్లెవున్న దీపంబుడ్డిని వెలిగించి, గూనెపెంకమీదపెట్టింది.

110

శంకరయ్య తలపైనుంచి గోనెతట్టుతీసి కొయ్యకుతగిలిచ్చి, గొడ్డలి ఓ మూలకుపెట్టి వారాట్లో గోళెంలోనుంచి నీళ్ళుతీసుకుని కాళ్ళు, చేతులు, మొఖం కడుక్కుని, ఇంట్లోకొచ్చి దండెంపైవున్న రుమాలుపేల్కతో తుడుచుకోసాగాడు.

బాలమ్మ పొయ్యిపెద్దడిచ్చి, పొయ్యిఅంటేసి, పొయ్యిమీద 'ఎసరు' పెట్టింది. తనువొచ్చేప్పుడు తీసుకొచ్చినగోకెంరాయ ఏరుతూకూర్చుంది.

మూలకున్న సాపతెంపు, ఓ మెత్త(దిండు) తీసుకుని వాకిట్లో పరుచుకున్నాడు శంకరయ్య. పడుకుని ఆకాశంలో చుక్కలనుచూస్తూ చిరుతల రామాయణంలోని పాటఅందుకున్నాడు.

భజనమండలిలో చేస్తున్న భజన చిన్నగావినిపిస్తూంది. సారాయి దుకాణంవద్ద ఎవరో కొట్లాడుకుంటున్నారు. మీదివాడలో ఎవరో పిలుస్తున్నారు. గంగెద్దులవాని గంటచప్పుడు దగ్గరవుతూవుంది. ఓవైపు కుక్కలుమొరుగుతున్నాయి. ఇంటిముందు 'చీదు'లో చిమ్మెట్లు 'కీససస్స'మని అరుస్తున్నాయి. మిడతలు 'కిసిక్ కిసిక్ కిసిక్'మని అంటున్నాయి. పెరట్లో చింతచెట్టుమీద గుడ్లగూబ అరుస్తూవుంది. గోరెంక పిట్టలు కలవరపడుతున్నాయి. ఒకటిరెండుకాకులు ఒకకొమ్మమీదినుంచి మరోకొమ్మ మీదికి ఎగురుతున్నాయి. సొన్నాయిల బాగయ్య తాళాలువాయిస్తూ "రేపుపొద్దుగాల పసుల దవాఖానకాడ రోగమొచ్చినకోళ్ళకు సూదులిస్తరో.... అందరు కోళ్ళను తీస్కరావాలో...." అంటూ తాళాలు వాయించాడు.

మబ్బులచాటుకు పోతున్న చందుర్నిణ్ణే చూస్తూ, రకరకాల ఆకారాలతో కదులు తున్న మబ్బులను చూస్తూ ఆమధ్యనే ఆప్రాంతంలో ప్రచారంలోకివచ్చిన 'జన నాట్య మండలి' పాటల్లోని తనకుఇష్టమైన 'వొడ్డెరోళ్ళ' పాటను అందుకున్నాడు శంకరయ్య.

'వొడ్డెరోళ్ళసుంది మేము
ఇన్నాళ్ళు గుడ్డిగా బతికినా
ఎడ్డోల్లం........
...."

మరోఒకటి రెండు పాటలు పాడాక

"తిందువులేవ్ బిడ్డ- పొద్దుగాల బుక్కెడంతతిన్నవ్.... ఎంత[illegible]యితుందో ఏమో? లేవ్‌తిందువు.... "అందితల్లి వాకిట్లోకొచ్చి.

శంకరయ్యలేచి జారాట్లో నోరుపుక్కిలించి, ఊసివచ్చి దీపందగ్గర గోనె తట్టు వేసుకుని కూర్చున్నాడు.

బాలమ్మ రెండు కంచుగిన్నెల్లో అన్నంవేసుకుని తెచ్చింది. ఓపెద్ద చిప్పలో కూర వేసుకొచ్చింది తెడ్డుతో కొడుక్కి ఇంతవేసి, తనూ ఇంత వేసుకుంది. ఆ మసక వెలుతురులో ఇద్దరూ తిన్నారు……… ………

పక్క వీధిలో కోడికూసింది. ఆతరువాత వరుసగా ఊరంతా కోళ్ళుకూసాయి. చెట్లపై ఒకటి రెండు కాకులు కొమ్మలు మార్చుతున్నాయి. కాపువారి వీధిలో గిలకల చప్పుడవుతోంది.

శంకరయ్య లేచి గోనెతట్టు కొప్పెర పెట్టుకుని బావిదగ్గరకు బయలు దేరాడు.

తెల్లున తెల్లారింది. అప్పటికే బాలమ్మ కోడిని విడిచిపెట్టి, వాకిలిఊడ్చి, పొయ్యిలో బూడిదిఎత్తి ఊడ్చి, రాతిరి కుండలను కడిగేసింది. బొక్కెన, కుండా తీసుకుని చేదబావిదగ్గరికిపోయింది. అప్పటికే బావిపద్ద చాలామంది నిల్చున్నారు….

నీళ్ళుతెచ్చి, వంటచేసి, తిని, కొడుకుకు 'సద్ది' కట్టుకుని కూలికిబయలుదేరింది బాలమ్మ.

ఒకరోజు కూలికిపోయి ఒకరోజు పోకపోయినప్పటికీ పదిహేనురోజులు గడిచిపోయాయి. శంకరయ్యమాత్రం పట్టుపట్టి చిరుతలరామాయణంలోని పాటలమాదిరి జననాట్యమండలి పాటలు నోటికిబట్టీపట్టాడు.

ఈమధ్యన బాలమ్మ పూలపూల కోడిపెట్ట ఎప్పుడూ పుంజుపక్కనే తిరుగుతూ గింజలేరుకుని తింటూవుంది. మధ్యాహ్నంపూట కేరుతూవుంది. మిగతా కోళ్ళ మధ్యకు పోకుండా హుందాగా పుంజుపక్కన, లేకపోతే ఒంటరిగానే తిరుగుతూ వుంది. జారాట్లో అన్నంమెతుకులు ఏరుకబుక్కుతున్నకోడి కేరడాన్నిచూసి, అదో రకమైన ఆనందంలో "కోడిగుడ్లకొచ్చింది. ఎన్నిగుడ్లుపెడుతదో సూడాలే? జిట్ట కోడికదా బాగనేపెడుతుండొచ్చు- ఈముచ్చట దొరకుచెప్పాలె…." అనుకుంది బాలమ్మ.

బొంగురులేని, పగిలిపోనిగొంతుతో పూలపూలకోడి కేరుతూవుంటే ఆ చప్పుడు వినడానికి ఎంతోబాగుంది. అది ఏకంగా కేరుతూనే తిరుగుతూవుంది.

మరుసటిరోజు కూళ్ళకోసం దొరఇంటికి అందరితోపాటు బాలమ్మకూడా పోయింది. అందరికి కూళ్ళుఇచ్చినాక దొరవారు దశరథరామిరెడ్డి బాలమ్మనుద్దేశించి.

112

"కోడి, గుడ్లు పెడతున్నాదేబాలి?...." అని అడిగాడు.

అరుగుకిందనిలపడి నేలచూపులుచూస్తూ నిడియుంగా, భయపడుతూ "నిన్న మొన్నటినంది కేరుతుంది పటేలా...." అని సమాధానమిచ్చింది.

"మరి చెప్పకపోతివేమె?" అలవాటుప్రకారం మీసాలుమెలేస్తూ అడిగాడు దొరవారు. అరుగుమీద పగిలీలుచెక్కిన కుర్చీలోకూర్చుని. ఎడమకాలు కుర్చీమీద పెట్టుకుని హూందాగావున్నాడు.

అరుగుకింద పూలచెట్లమీద రెక్కలపురుగులు వాలుతూవున్నాయి. నేలమీద నల్లచీమలబారునుచూస్తూ "ఇయ్యాళ చెప్పేతందుకే వొచ్చినదొరా" అందిబాలమ్మ.

కుర్చీమీదినుంచి కాలుతీసి, కిందవున్న 'మాదిగ' చెప్పును తొడుక్కొని

"జెరమంచిగ సూసుకో. తొలుసూరి గుడ్లు అమ్ముకోకు, పొదిగెయ్య ఏమంటున్ననేబాలి?...." హెచ్చరించినట్లు అన్నాడు దొరవారు.

"గట్లనేదొరా....' దించిన తల ఎత్తకుండానే అంది.

దొరవారు కుర్చీలోంచిలేస్తూ, తొడలవద్ద గోక్కుంటూ "మంచిదిఫో...." అని లోపలిగదిలోకి పోయాడు.

బాలమ్మ తనతోటి వాళ్ళను చేరడానికిగాను గేటుదాటి, కావలిముత్యాలును తాగుబోతు మల్లయ్యను దాటి విరవిరా అడుగులేసింది.

మరో నాలుగు రోజుల తరువాత బాలమ్మ పొయ్యివద్ద వంటచేస్తూ వుండగా, కోడిపెట్ట కేరుతూ ఇల్లంతా మూలలను పరికిస్తూ తిరుగుతూవుంది. ఆవేళప్పుడు మేతకు పోకుండా ఇంట్లోనే తిరుగుతూవుందంటే, కోడి గుడ్లకొచ్చిందని బాలమ్మకు తెలిసిపోయింది. వెంటనే మెల్లిగావెళ్ళి గబుక్కున కోడిని పట్టుకుంది. కోడి అటూ, ఇటూ పరుగెత్తకుండా నిలుచున్నదగ్గరే కూర్చుడిపోయి లొంగిపోయింది. తీసుకెళ్ళి గంపకింద కమ్మింగి బాలమ్మ.

అన్నంవండి, చారుచేసి, నీళ్ళుతెచ్చి, కొన్ని ఏరుపిడుకలు ఏరుకొచ్చి, తిని. తలవెంట్రుకలు దులుపుకుని ముడేసుకుని కూలికిపోవడానికి సిద్ధమవుతుండగా గంపకింద చప్పుడయింది. గంపలేపేసరికి కోడి గబుక్కున బయటపడింది. గోధుమరంగులో పెద్ద కోడిగుడ్డు....

బాలమ్మ మొఖం విప్పారింది. కళ్ళుమెరిసాయి. రెక్కలు విదుల్చుకుంటూ వెంటమీదికిపోతున్న కోడిని సంతోషంగా, తృప్తిగాచూసింది. మెప్పుగావున్న ఆ

గుడ్డును తీసుకుని, గంపకొయ్యకు తగిలించి, తైదల కుండలో గుడ్లను జాగ్రత్త పెట్టి కూలికి బయలుదేరింది.

పద్నాలుగు రోజులు కోడి వరుసగా గుడ్లుపెట్టింది. ఆ పద్నాలుగు రోజులు గుడ్డుతినాలన్న కోరికను బలవంతాన అణచుకున్నారు తల్లీ కొడుకులు. ఆ తరువాత కోడి 'కుడుకు' కూర్చుంది.

ఒకరోజు శంకరయ్య బావివద్దనుంచి ఎండిన వరిగడ్డి తీసుకొచ్చి ఓపాతతట్టలో వేసాడు. బాలమ్మ అందులో పద్నాలుగు గుడ్లను గుండ్రంగాపెట్టి, వాటిపై కుడుకు కూర్చున్న కోడిని కూర్చోబెట్టింది.

రెండురోజుల కొకసారి గుడ్లమీది నుంచి కోడిని వదిలి నీళ్ళు, గింజలుపెట్టి గంట తర్వాత తిరిగి గుడ్లమీద కూర్చోపెట్టేది బాలమ్మ.

అమావాస్యకు ముందు పొడిగేస్తే, పున్నమి వచ్చింది. ఒకరోజు ఉదయం గంపకింద కోడిపిల్లల లేతకంఠాలు వినిపించాయి. ఇంట్లోనేవున్న శంకరయ్య ఆత్రంగా పైనించి గంపతీసిచూసాడు. కోడి మెడకింద రెండుపిల్లలు అరుస్తూ వున్నాయి. కోడినితీసి ఇంకెన్ని ఉన్నాయో చూద్దామనుకుని కోడిని పట్టుకోబోతే ముక్కుతో పొడవసాగింది. ఒడుపుగా రెక్కలవద్ద పట్టిలేపాడు, మరోరెండు పిల్లలు వున్నాయి.

బాలమ్మ పొయ్యివద్దనుండివచ్చి నాలుగు కోడిపిల్లలను బయటకుతీసి, వాటి పగిలిన గుడ్లను తీసేసింది. శంకరయ్య చేతిలోనికోడి, తన పిల్లలకు ఏమిఅపాయం జరుగనున్నదో అని గింజుకుంటూవుంది. వీలైనప్పుడల్లా ముక్కుతో శంకరయ్యను పొడవడానికి ప్రయత్నిస్తూవుంది. బాలమ్మ మిగతాగుడ్లను అలాగే పేర్చిపెట్టింది. సన్నటినూకలుతెచ్చి కోడిముందు పోసింది. తల్లీ కొడుకులు అక్కడున్నంతసేపూ పరిగి కంపలాగ తన పిల్లలచుట్టూ, గుడ్లచుట్టూ 'క్కొక్కొక్కొక్కొ' అని బూరంత నిక్కబొడుచుకుని ముడితిరుగుతూవుంది. వాళ్ళిద్దరూ అక్కడినుంచి కదిలాక పిల్లలు లేతకంఠాలతో అరుస్తూ తల్లిబుక్కినట్టు బుక్కడానికి ప్రయత్నిస్తూ వున్నాయి. తల్లినూకలను మరింత చిన్నగాకొరికి పిల్లలముందు వదేస్తూవుంది. ఆ ముక్కలను అవి కొరుకుతూవున్నాయి.

మరో రెండు రోజులకు మరిరెండు పిల్లలు వచ్చాయి. మిగతాగుడ్లు 'చీయ గుడ్లు' అయినాయి. బాలమ్మ ఆగుడ్లన్నింటిని చెవివద్ద పెట్టుకుని ఊపిచూసి, లాభం

లేదసుకుని పెంటలోపారేసింది.

ఓచిన్న 'కంచుడు' (మట్టిమూడుకు)లో నీళ్ళుపెట్టి, నన్నటి నూకలను కోడి ముందు ప్రతిరోజు తల్లి కాకపోతే కొడుకు, కొడుకు కాకపోతే తల్లి పెట్టేవాళ్ళు. ఆ ఆరుకోడిపిల్లలు కంచుడుచుట్టూచేరి ముక్కులుముంచి, తలలుపైకెత్తి గుటగుట నీళ్ళుతాగేవి. అలా తలలుపైకెత్తినప్పుడు అవిచాల అందంగా కనిపించేవి.

ఓరోజు కూళ్ళకోసం దొర ఇంటికిపోతే, దొరవారు గచ్చులో పెద్దపీట (నాలుగు కాళ్ళ చెక్కబల్ల) మీద కూర్చున్నాడు. తనవైపు చూడకపోయేసరికి బాలమ్మ కొద్ది సేపు అలాగే నిల్చుంది.

దశరథరామిరెడ్డిదొర పరధ్యానంగా వాకిట్లోకిచూడగానే బాలమ్మ కనిపించింది. గచ్చులోనుంచే

"ఏందేబాలి? ఏమెొచ్చినవూ?" అని అడిగాడు

"ఏంలేదుపటేలా. ఒక్కరోజు కూలివచ్చేమన్నది" కాలి బొటనవేలుతో దగ్గ రలో వున్న బొక్కెవంచును దూరంజరుపుతూ చెప్పింది.

"పెద్దజీతగాడులేడు, మల్లరాదో...."

"...................." బాలమ్మ చప్పుడుచేయకుండా నిల్చుంది.

"ఏమె అట్లనేనిలవడ్తివి?" విసుగ్గా అడిగాడు.

"కోడి పిల్లలజేసింది పటేలా...." భయం భయంగానే అన్నది.

దొరవారిమొఖంలో మార్పుకనిపించింది. కుతూహలంతో

"ఎన్నిపిల్లలజేసిందే?" అడిగాడు.

ఏమంటాడోఏమో? ఏమంటాడోఏమో? అని మనసులో బుగులుతోనే "ఆరు పిల్లలజేసింది పటేలా.... యెనిమిది శియ్యగుడ్లు అయినయ్" అంది.

దశరథరామిరెడ్డి మొఖంలో కనిపించినమార్పు మాయమయింది. తిరిగి విసుగు, కోపం చోటుచేసుకున్నాయి. అనుమానంతో

"ఎనిమిది 'చియ్యగుడ్లు' అయినయా లేక ఆరేపొదిగేసినవానే?" అడిగాడు.

"నా యిమానంగ పటేలా పదిమీద నాలుగుపొదిగేసినా" అంది.

ఇక ఏమిఅనలేక దశరథరామిరెడ్డి

"ఇగఏంజేస్తవుపో. ఇమానం, పరిమాణం చినవడ్తివి, ఎగనమ్మాలే నమ్మకుంటె నడుస్తదా?" నిష్టూరంగా మాట్లాడాడు.

నిజంచెప్పినా దొరసమ్మకపాయె అని మనసు కష్టపెట్టుకుంటూ అక్కడినుంచి బాలమ్మ కదిలింది.

కోడిపిల్లలు నెలరోజులపాటు ఇల్లు, వాకిలివదిలి దూరంపోయేవికావు. ఆ తరువాత పెంటలపైకి పోసాగాయి. కోడిపిల్లలతో బయటికెళ్ళిందంటే బాలమ్మకు గద్దలతో బయముండేది. కోడిపిల్లలమీదికి పోయినందుకుగాను కుక్కకాలు విరగగొట్టింది. పిల్లిని ఎప్పుడూ బెదిరిస్తూవుండేది.

మరోరెండునెలలు గడిచాక కోడిపిల్లలు కాస్తపెద్దగయ్యాయి. తల్లిని ఎడబాయకున్నా, తల్లిరెక్కలకింద పొదగకున్నా, అప్పుడప్పుడూ స్వతంత్రిచ్చి అటూ ఇటూ తిరిగినా మళ్ళీ తల్లిచుట్టూతిరిగేవి.

ఒకరోజు ఉదయం పొయ్యింట్లో బాలమ్మ వంటచేస్తూవుంటే ఓకోడిపిల్ల కయకయమంటూ ఇంట్లోనే తిరుగుతూవుంది. మిగతా పిల్లలతోపాటు పెంటమీదికి పోవడం లేదు. కనురెప్పలుమూస్తూ, బలవంతానతెరుస్తూ, కునికిపాట్లుపడుతూ నిల్చున్న స్థలంనుంచి జరగటంలేదు. కోడిపిల్ల పరిస్థితినిచూసి బాలమ్మ గుండెలు జల్లుమన్నాయి. మనసులో ఏదోమూల భయం. పెంచిపెద్దచేసిన ప్రేమ. కళ్ళముందే ఆరాటపడుతున్నందుకు బాధ....

ఎల్లిపాయ (వెల్లుల్లి) దంచి, కోడిపిల్లనుపట్టుకుని, దాన్నోట్లోవేసి నీళ్ళు పోసింది బాలమ్మ. క్యావ్ క్యావ్‌మని కోడిపిల్ల అరుస్తూనేవుంది. బాలమ్మఏదో గులుగుతూనే, ఏదేదో అనుకుంటూనే కోడిని గంపకిందకమ్మింది. ఆతర్వాత ఇంట్లో పనులన్నిచేసి, కూలికివెళ్ళింది.

కూలికిపోయినా మనసంతా కోడిపిల్లమీదనేవుంది. సాయంత్రం కూలినుంచి తిరిగొచ్చి గంపలేపి చూసేసరికి ఏముంది? కోడిపిల్ల చచ్చిపోయి పడివుంది. గండుచీమలు పట్టివున్నాయి.

బరువెక్కిన బాలమ్మగుండెల్లో దడ, భయం, బుగులు. ఒళ్ళంతా చెమటలు పట్టాయి, కళ్ళల్లోకి నీళ్ళుదునికాయి.... దొర దశరథరామిరెడ్డి చూపులు, అరుపులు. పొన్నుకర్ర.... పగిలీలకుర్చీ.... పాటాకు.... కాపలిముత్యాలు.... బరిసెకర్ర.... దొరదర్వాజు.... కచ్చడం.... చర్నకోల.... ఎలితెబరిగె.... కళ్ళముందుకదిలాయి. దుఃఖం మరింతపొంగుకొచ్చింది.

కోడిపిల్లలకు పట్టిన చీమలను దులిపి, ఒడిలోవేసుకుని, మిగతా కోడిపిల్లలను కోడినికమ్మి పొద్దుగుంకుతుండగా దొర దగ్గరికి చేరింది.

బయటగేటుకాడ్డ కావలి పుల్యాలు బరిసెకర్రి పక్కకుపెట్టుకుని కూర్చున్నాడు. లోపల వరండాలో నాలుగైదు కుర్చీల్లో దొర స్నేహితులు, చుట్టాలుకూర్చున్నారు. మధ్యలో దశరథరామిరెడ్డి.

మాట్లాడుతూ మాట్లాడుతూ అరుగుకింద నిల్చున్న బాలమ్మనుచూసి అక్కడి నుంచే "ఏందేబాలి, ఏమో ఒచ్చినవూ?" దొరతనం ఉట్టిపడేలా అడిగాడు.

ఎట్లచెప్పాలె? ఎట్లచెప్పాలె! అని చేతులునిసుక్కుంటూ ఓ క్షణం దొరవైపు చూసి తిరిగి నేలచూపులుచూస్తూ ఆలోచిస్తూ, నీళ్ళు మింగుతూవుంది.

ఎత్తుగా కనిపిస్తున్న ఒడినిచూసి, చప్పుడుచేయకుండా నిలుచున్నవైనంచూసి దొరకు ఏదో అనుమానం కలిగింది. కాని ఆ అనుమానాన్ని గొంతులో పలికించకుండా "ఏందే?.... ఒళ్ళోఏమో తీసుకొచ్చినవూ? ...." అడిగాడు.

'చెప్పేతందుకు దొరనే ఒకదారి సూపిచ్చిండు' అని మనసులో అనుకుని భయపడుతూ, భయపడుతూ, వొణుకుతూ ఒడిలోనుంచి చచ్చినకోడి పిల్లనుతీస్తూ "కోడిపిల్ల సచ్చిపోయింది దొరా నీ కాల్మొక్త.... పొద్దుగాల మంచిగుండే, అంబటాళ్ళకు సుస్తయింది. సుస్తయిందని ఎల్లిపాయ దంచిపోసి, గంపకిందకమ్మి కూలికి పోయొచ్చెటాకళ్ళనే సచ్చిపోయింది. దొర నీబాంచనైత ఇంత్ల నాదోస (తప్పు)మేమిలేదు...." అంది కోడిపిల్లను అరుగుమీదపెడుతూ

తనచుట్టూ స్నేహితులు, చుట్టాలువున్నారు. వాళ్ళముందు తానుకోళ్ళను బటాయికి ఇస్తున్నవిషయం తెలియడం దశరథరామిరెడ్డికి ఎందుకో బాగనిపించలేదు. దాంతో పండ్లు పటపటమంటున్నా, మనసులో కోపంపొంగుతున్నా, ఎంతోఅసహ్యమున్నా అవన్ని బయటకు కనిపించకుండా అల్లాటప్పా సంగతిలా తీసిపారేస్తూ

"సస్తే సచ్చిండిపో...." అని నవ్వుతూ తనస్నేహితులవైపు తిరిగాడు.

బాలమ్మ ఆశ్చర్యపడింది. ఆశ్చర్యం సంగతి ఎలావున్నా మనసునిమ్మలమయింది. గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నట్లనిపించింది, కళ్ళల్లో పోయిన మామూలుకాంతి తిరిగొచ్చినట్లయింది. ఎన్నితిడుతడో? ఎన్నికొడుతడో? ఏం బాధనో? ఏంగోసనో? ఏంకథనో? అనుకుని వణుక్కుంటవచ్చిన తనకు దొర ఒక్కమాటతో 'అంతాతీరిపోయింది' అనుకుంది. మనసులోనే దొరకు దండంపెట్టి సచ్చినకోడిని తిరిగి ఒడిలోపెట్టుకుని, ఒడిగొదిగి గేటుదాటి, ఇంటికిచేరింది.

ఇంటికొచ్చేసరికి తనకొడుకు, మరొకతను అరుగుమీద కూర్చున్నారు. విచారంగా వొస్తున్నతల్లినిచూసి

"ఏడికిపోయినవే?........" అని అడిగాడు శంకరయ్య

"దొర ఇంటిదాకపోయిన"

"ఎందుకూ?"

"ఓ కోడిపిల్ల నచ్చిందిబిడ్డా" అని ఒడిలోనుంచితీసి చూయించింది.

శంకరయ్య నొచ్చుకున్నట్టు 'చ్చొ....చ్చొ....చ్చొ....' అన్నాడు.

కొడుకుపక్కన కూర్చున్న అతన్నిచూస్తూ "ఎవరికొడుకుపుబిడ్డా" అని అడిగింది, పరిశీలించిచూస్తూ

"ఈ ఊరుగాదు- అటు దూరం.... అప్పుడప్పుడు బాయికాడికివొస్తడు- ఇయ్యాల మనింట్లనేఉండుమని తీసుకొచ్చిన...." శంకరయ్య

"అయ్యో.... తీసుకొస్తే తీసుకొచ్చినవ్ తియ్యబిడ్డా- బుక్కెడు బువ్వనేగదా.... బంగారమా? భాగ్యమా తినేది?...." ప్రేమగాఅంది బాలమ్మ

"ఆ నచ్చినకోడిని పారెయ్యక పోయినవే?" శంకరయ్య

"పారేస్త, పారేస్త...." అంటూ బాలమ్మ పొయ్యింట్లోకి పోయింది.

శంకరయ్య, తనతోవచ్చిన కామ్రేడ్ నారాయణకు దొరవారు తమకుకోడిని ఎలాబటాయికి ఇచ్చింది? ఇస్తే తిరిగిఎలాఇవ్వాలి? ఆకథ కమామిషూ అంతా వివరించి చెప్పాడు. నారాయణకు ఆవిషయం విచిత్రమనిపించింది. ఆ తరువాత దొరకు గ్రామప్రజలకుమధ్యవున్న సంబంధాల గురించి, దొరగారు ఏఏరంగాల్లో ఏవిధంగా దోచుకుంటున్నది అన్నవిషయంపై చాలాసేపు చర్చించుకున్నారు. భోజనాలైయ్యాక కొత్తపాటలు ఎన్నో పాడుకున్నారు.

* * * * *

ఊర్లో వరికోతలు జోరుగాసాగుతున్నాయి. తీరికలేకుండా ఆడకూలీలు పొద్దటకూళ్ళకు పోతున్నారు. స్నానాలుచేయడానికి, బట్టలు ఉతుక్కోవడానికి, ఇళ్ళుఅలుక్కోవడానికి తీరికలేకుండా పనులవొత్తిడి ఎక్కువగావుంది. బావులమీద జీతగాళ్ళు సరిగ్గా నిద్రపోకుండా పనులుచేస్తూ వున్నారు. ఏ బావిమీదచూసినా వరికల్లాలు, బంతులుకట్టడం, వడ్లను తూర్పారపట్టడం, పొలియో పాటలు.... ఇంకా పూర్తిగా ఎండని వరిగడ్డి తీయటివాసన....

118

బాలమ్మకూడా పొద్దటికూళ్ళకు పోతూంది, నెత్తి 'మాశిం'ది, బట్ట 'మాశిం'ది. అయినా అవన్నీ పట్టించుకోకుండా రాత్రి తినిపడుకునేందుకు ఇంటికొస్తె, మిగితా సమయమంతా పొలాల్లోనే గడిచిపోతుంది.

ఒకరోజు చీకటిపడ్డాక పెద్దతట్టలో కూళ్ళగింజలను తలపై పెట్టుకుని ఇంటికొచ్చింది. అరుగుమీద కోళ్ళచప్పుడు వినిపించలేదు. ఎక్కడయిన దూలాలమీద, వాసాలమీద పడుకున్నయెమోననుకుంది. కాని మనసులో అనుమానంగానేవుంది, దాంతో దీపం వెలిగించి రోజూకోళ్ళుండే స్థలంలో చూసింది.

బాలమ్మ తన కళ్ళను తానేనమ్మలేకపోయింది. నోటెమ్మట మాటరాలేదు, తన మీద ఎవరో పగపట్టినట్టనిపించింది. మొఖంలో రక్తంగడ్డకట్టుక పోయినట్టయింది. గుండె వేగంగా-కొట్టుకోసాగింది. నరాల్లో రక్తంగాక మరేదో పాకినట్టనిపించింది.... ఒకటికాదు, రెండుకాదు నాలుగు కోడిపిల్లలు చచ్చిపోయివున్నాయి. అందులో రెండు పుంజులు, ఇప్పుడిప్పుడే తలలపై జుల్లు పెరుగుతున్నాయి. మిగితా ఒకపిల్ల, తల్లి చావు బతుకుల్లో వున్నాయి. నిలుచుండి. నిలుచుండే గిర్రునతిరిగి పడిపోతూవుంది తల్లికోడి. తిరిగి నిలబడుతూవుంది.

బాలమ్మదీపం కిరిందపెట్టి మనుసులోంచి తన్నుకొస్తున్నదుఃఖాన్ని పెదవుల మధ్య బిగపట్టి, ఉద్వేగంతో గజగజలాడుతూ, రెండుచేతులు తలకు పెట్టుకుని, చచ్చి పోయివున్న కోడిపిల్లలను చూస్తూ "....ఇగనేన్ ఏంజేతురా తండ్రీ, గాలికి పోయే కంపనెత్తికి సుట్టుకున్నట్టాయే.... ఒకగద్దను, పిల్లిని, కుత్తసురానియకుంట బంగారం లెక్క సాదితే అఖరికి నామెడకు ఉరిదెచ్చినయ్ గదరా తండ్రీ.... ఇగనేన్ ఏంచేద్దు? ఎక్కడపోదు??...." ఏడుస్తూకూర్చుంది.

కొద్దిసేపులాగినాక ముక్కుచీది, చనిపోయిన నాలుగు పిల్లలను ఒకదాంట్లో కమ్మి మిగతారెండింటిని ఒకగంపకిందకమ్మి వంటచేయకుండా, తినకుండా అలాగే పడుకుంది. ఆరాత్రి శంకరయ్య ఇంటికిరాక బావివద్దనే వడ్లకుప్పవద్ద కావలి పడు కున్నాడు.

పొద్దునలేచి చీపిరితీసేందుకు కోళ్ళగంపల దగ్గరికిపోయేసరికి, కోడిబూరు అక్కడక్కడ పడివుంది. భయంతో, కంగారుగా మొదటి గంపని లేపనెత్తింది.... తల్లికోడిలేదు, కోడిపిల్లచచ్చిపోయివుంది. తల్లికోడిబూరుకొంత గంపకిందపడివుంది. బాలమ్మకు ఎవరినితిట్టాలో, ఎవరిని కొట్టాలో ఎవరిమీద మన్నుపొయ్యాలో తెలి

యక ఉద్వేగంతో, కసితో, ముంచుకొస్తున్న ఆవేశంతో మరోగంపను లేపట్టింది అందులో ఒకపిల్లలేదు. బోరున దుఃఖంవచ్చింది. ఏడ్చింది. గుండెలుగుద్దుకుంది, శోకంపెట్టింది, కసిగాతిట్టుకుంది, తిట్టింది.

ఒకదగ్గరమూడు, మరోదగ్గర ఒకటి కోడిపిల్లలు పడివున్నాయి. దగ్గరలో ఒకటి రెండు రక్తపుచుక్కలు ఆరిపోయివున్నాయి.

'....నాఇల్లు మునిగింది.. నానోట్లెమన్నువడ్డది.... ఇగనేన్ ఏగుట్టలపొంటి పోను, ఏవాగులపొంటిపోదు.. అని ఎక్కడపోయినా దండుగనే, పోయిదొరకాళ్ళ మీదనేపత్త ఏమన్నగాని....' అనిబాలమ్మనిర్ణయించుకుంది.

చచ్చిన నాలుగు కోడిపిల్లలను ఓ తట్టలోవేసుకుని దొర దశరథరామిరెడ్డి 'బంగ్ల'కు చేరింది. బయట గేటువద్ద ఎవ్వరూలేరు. పాటాకుతీసేవుంది. ప్రాణం మంతా బిగపట్టుకుని, సవాలక్షఆలోచనలు మెదడులో మెదులుతుండగా 'ఏమంటడో? ఏంతంటనో....' అనుకుంటూ అరుగువద్దకొచ్చింది.

కావలిముత్యాలు చంకలో కర్రఇరుకిచ్చుకుని వినయంగావంగి చెప్తున్న విషయాన్ని వరండాలో ఆరాముకుర్చీలోకూర్చొని దొరవారు దశరథరామిరెడ్డి చిరాగ్గా వింటున్నాడు, అప్పుడప్పుడు కనుబొమలు ముడేస్తూవున్నాడు. గౌడసంఘంవాళ్ళు ఈఏడు తనకుకాదని 'మామ్లా' పట్టడానికిపోయారన్న విషయం తనని దహించి వేస్తుంది. అందుకే చిరుబురులాడినట్టుగా వుంది మొఖం.... ముత్యాలు చెప్తున్న విషయాలు ఓచెవుతో వింటూ అటూ, ఇటూ చూస్తున్నాడు. అరుగు కింద గంపతో బాలమ్మ కనిపించింది. 'అదేం కథ ఎత్తుకొచ్చిందో?....' అని మనసులోనే అనుకున్నాడు.

బాలమ్మ నీళ్ళులేక వాడిపోయిన అందంకాయ (సొరకాయ) పాదు ఆకులా మారింది. ఆమె మొఖంలో జీవంలేదు, కళ్ళకింది గుంతల్లో నల్లటి ఛాయలు.... మెడలో నాలుగు 'గుండ్లు' కూడాలేకుండా బోసిగావుంది. తడారిపోయిన పెదవులు తెల్లబడ్డాయి. మట్టి కొట్టుకపోయిన జుట్టు, బట్టలు, ఆకారం పూర్తిగాదీనంగావున్నది.

ముత్యాలు చెప్పిన సంగతులన్నీ విన్నాక ఆరాము కుర్చీలోంచి లేచి, ద్వారానికి కట్టిన ఎంబ్రాయిడరీ గుడ్డను చేయితో జరిపి అరుగు మీదికొచ్చాడు.

దశరథరామిరెడ్డి తన దగ్గరికి రాకముందే

“....పటేలా.... దొరా నీ కాల్మొక్త.... బాంచనైత.... నా యిమానంగ నేను

కపటంలేకుంట కోళ్ళనుపెంచిన- గద్దలను, కుక్కలను, పిల్లులను రాకుంట దినాం కాపాడిన, ఆఖరికి నా సగోవ నక్క గలేక రోగమొచ్చి గప్పుడు ఒకకోడిసచ్చింది- ఇప్పుడు మొత్తానికి మొత్తం అన్నికోళ్ళ సచ్చినయ్...." అని గంపను చూయించి, దూరం నుంచే దొరతాళ్ళకు బయపడుతూ మొక్కింది బాలమ్మ

'....అన్నికోళ్ళ సచ్చినయ్....' అనేసరికి దొరవారి కనుబొమలు ముడుచుకు కున్నాయి, అప్రయత్నంగా ముక్కుపుటలు కదిలాయి, ఓచేయి మీసాలపైకి కదిలి మీసాలనుమేలేసింది.. పిల్లకుడ్త (నైహాఫ్‌షర్ట్) లోనుంచి గుండెపొంగడం, తగ్గడం కనిపిస్తూవుంది, నన్నటిదోవతి చెంగును ఓచేత్తో పట్టుకుని మరో రెండుఅడుగులు ముందుకేసాడు, ముందుకొంగి గంపలోకి తొంగిచూసాడు.

సచ్చినకోడిపిల్లల కళ్ళుమూసివున్నాయి, కాళ్ళు జీవంలేక పడిపోయాయి, అందులోరెండు కోడిపిల్లలతలపై జుట్టుపెరుగుతూవుంది. ఇప్పుడిప్పుడే పుష్టిగా తయారవుతున్నాయి. దొరవారు గంపను మార్చి మార్చిచూసి

"నేనిచ్చిన కోడిపెట్ట, పూలపూలకోడి కనిపిస్తలేదేమేఇండ్ల? అడిగాడు.

బాలమ్మగుండెల్లో పడగండ్లు పడ్డట్టయింది. సచ్చిన కోడిలేకపాయె ఏమంటాడో? అని భయపడుతూనే, అనుమానంతో రెండుచేతులుజోడించి పట్నిలిపట్టి

"....పటేలా నీకాల్మొక్త, నేనెఅబద్దంఆడ్తలేను, సచ్చిన కోడివాసనకు ఏ కుక్కవొచ్చిందో, నక్కొచ్చిందోగాని గంపకిందికెలి ఎత్తుకపోయింది. అట్ల తల్లి కోడిపోయింది, ఇంకోపిల్లపోయింది....అంది.

దశరథరామిరెడ్డి గుండెల్లోనిరక్తం ఒక్కసారి మొఖంలోకిచిమ్ముకొచ్చి మొఖమంతా ఎర్రగైంది, కళ్ళ మరింతఎర్రగయ్యాయి.. గౌడసంఘంవాళ్ళు రాజేసిన కోపం, బాలమ్మతీసుకొచ్చిన సమాచారంతో మరింతపెరిగింది. చస్తే అన్నికోళ్ళ ఒకేసారిచస్తాయా? చస్తే అందులో తల్లికోడినే కుక్కఎత్తుకపోవాలా? కుక్కఎత్తుకపోయేంతవరకు ఏంచేసినట్టు? ఇలా ప్రశ్నించుకుంటే దొరవారికి ఎక్కడో మోసం జరిగిందనిపించింది. గౌడ సంఘం వాళ్ళు తనసుకాదని 'మామ్‌ల'కుపోయి ఎలా మోసంచేశారో, బాలమ్మ కూడ పూలపూలకోడిని అమ్ముకుని, పిల్లలను దొరకెందుకు కియ్యాలె మందుపెట్టిసంపుత అని చంపివుంటదని దొర మనసులో పొగలా నిండిపోయింది. దాంతో,

121

"నిజంగనే కుక్కెత్తుకపోయినాదే?...." అడిగాడు వ్యంగ్యంగా

"నాయిమానంగ పటేలా, నా కొడుకుతోడు.... బటాయికిచ్చిన పూలపూల కోడి సచ్చింది, రాతిరి కుక్కెత్తుకపోయిందో? ఇంకేది ఎత్తుకపోయిందో సూడలేదు" అని బాలమ్మ చెప్పింది. అంతే....

దశరథరామిరెడ్డి పక్కననిల్చున్న కావలి ముత్యాలు చేతిలో నుంచి బరిసెకర్రి లాక్కుని "ఎవనికి నేర్పిస్తున్నవే నీయమ్మ తాశిలిమొఖంల.... ఎక్కతినేదాన, కోడిని ఏడనో అమ్ముకుని సచ్చిందని వచ్చినావ్, నీతల్లి.... నీ కులాన్ని ఎవడు సమ్మిందే.... మీదికేలియిమానం, ప్రమాణం, కొడుకుతోడు లింటావ్?...." అంటూ బలంగా తొడలమీద రెండుదెబ్బలు వేసాడు.

బాలమ్మ ఆదెబ్బలకు తాలలేక లబలబ మొత్తుకుంటూ కిందకూలబడిపోయింది. దొరవారి కోపం చల్లారలేదు.... బాలమ్మ పబ్బతిపట్టి దొరకు మొక్కుతూ "కోడిని అమ్ముకోలేదు పటేలా. గంత బెయిమాన్ దాన్నికాను దొరా.... నీ కాల్మొక్త కొట్టకుండ్రి.... నీకు దండంజేస్త...." అంది.

చేసినతప్పుచాలక పైనుంచి 'కొట్టకుండ్రి' అంటదా? అని దశరథరామిరెడ్డికి మరింత కోపంవచ్చింది. దాంతో మరో నాలుగు కర్రిదెబ్బలు వీపుపైపడ్డాయి. దెబ్బలను తప్పించుకునేందుకు చేసిన ప్రయత్నంలో రవికెముడి విడిపోయింది. వీపులో చిరిగింది, కొంగు జారిపోయింది. రొమ్ములు నగ్నంగా బయటపడ్డాయి రెండు చేతులతో గుండెలను దాచుకుంటూ కూర్చుండిపోయింది బాలమ్మ.

కావలిముత్యాలు నిస్సహాయంగా, రాయిలానిలబడివున్నాడు. దారినపోయే వాళ్ళు గేటువద్దఆగి, చోద్యంచూస్తున్నట్టు నిల్చుండిపోయారు. వారిలో పిల్లలు, స్త్రీలే ఎక్కువమంది వున్నారు.

దొరవారి అరచేయి ఎర్రిగయింది. కొద్దిగా మంటలేచింది, కసితీరా ఆఖరి దెబ్బ ఒకటివేసి కర్రిదూరంగా విసిరేసి "ఫో దొంగముండ ఫో.... కావలోనితోని దండుగపైసలు ఇరువైరూపాలు పంపిచ్.... సదూ, ఇంక ఈడ కన్పియ్యొద్దు...." అని కావలి ముత్యాలు వైపుతిరిగి "దానిఎంబడిపోయి పైసల్ తీసుకరారా!...." అని గబగబఇంట్లోకి వెళ్ళిపోయాడు. ముత్యాలు సరేఅన్నట్టు మౌనంగా, వినయంగా భయంతో తలడింపాడు.

బాలమ్మ కుమిలి కుమిలి లోలోపల ఏడుస్తూ కొంగు బుజాలమీదుగా చుట్టుకుని నోటికి అడ్డంగా పెట్టుకుని మెల్లిగాలేస్తూ, ఒక్కసారి దొర పోయినవైపుచూసి 'వీని

ఇంట్ల మన్నువడా, వీనిచేతులకు చెదలుపట్ట....' అని మనసులోనేతిట్టుకుని తలకింది కేసుకుని ఇంటిదారిపట్టింది. కావలిముత్యాలు మౌనంగా ఆమెను అనుసరించాడు.

నడువలేక, నడువలేక అడుగులో అడుగువేస్తూ, నరాలన్నిబిగపట్టుకుని ఇంటికిచేరి, ఎందుకైన అక్కరకొస్తయని పెట్టెలోదాచిన పదిహేనురూపాయలుతీసి, మిగతా ఐదురూపాయలు 'గల్లగుర్గి' పగలకొట్టితీసి ముత్యాలుచేతిలో పెట్టింది. కావలిముత్యాలు కళ్ళళ్ళకు నీల్లుతీసుకుని మెల్లిగాదొర బంగ్లకునడిచాడు.

దశరథరామిరెడ్డి బాలమ్మను కొట్టాడన్నవిషయం ఊరంతటికీ తెలిసిపోయింది. కుర్రోరు కర్రిలుతీసుకుని ఎగిరారు. ముసలివాళ్ళు, అనుభవజ్ఞులు నిదానంగా చుట్టలుకాలుస్తూ ఆలోచించి ఆపారు, బతిమాలారు, గదవలుపట్టుకున్నారు, కడుపులో తలలుపెట్టారు, అప్పటికి కొంతచల్లబడ్డారు యువకులు.

శంకరయ్యకు బాయిమీదనే విషయంతెలిసి ఇంటికి పరుగెత్తుకొచ్చాడు. ఇంట్లో ఓమూల చింపులచాపమీద తల్లి మెల్లిగా మూల్గుతూపడుకుంది. రొప్పుతూవచ్చిన శంకరయ్య తల్లిపరిస్థితినిచూసి ఏడ్చినంత పనిచేసాడు. శరీరమంతా నిమిరిచూసాడు. వీపులో నల్లగసారికలు, కమిలిపోయినదెబ్బలు, ఒళ్ళంతా వెచ్చగాకాలుతుంది. చిరిగిపోయిన రవికె.... శంకరయ్య మనసులో అగ్నిజ్వాలలు లేచాయి. రక్తం సముద్రపుపోటెత్తింది. ప్రతీకారం తీర్చుకోవాలన్న ఆరాటం, కసి బయలుదేరింది.

కొడుకు మానసిక పరిస్థితిని గమనించి బాలమ్మ కొడుకును దగ్గరికి పిలిచి "నన్ను ఆడు కొట్టిండని నువ్ వాని 'తెరువు'కు పోకుబిడ్డా! వాడు ఇస్పపురుగు. రాష్ట్రపడ్డ వానివగపోదు.... వానితోని నువ్ కంఖపెట్టుకోకు. నేను ఇయ్యాలగాక పోతే రేపునచ్చేదాన్ని. నువ్ యింకనాల్గొద్దులు బతికేటోనివి, నువ్ వాని జోలికిపోకు బిడ్డా! నామాటిను. నువ్ వాని కంట్లెపడకు...." అని గదవ (గడ్డం) పట్టుకుంది.

శంకరయ్య కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

బాలమ్మను చూసేందుకు ఆ వాడవాళ్ళు, తెలిసిన వాళ్ళు వస్తువున్నారు. పోతున్నారు. ఎవరికి తోచినమాట వాళ్ళు చెప్తున్నారు.

సాకలి మైసయ్య, తెనుగు బాలయ్య కాపు మల్లారెడ్డి ఇంకా ఇద్దరు ముగ్గురు సంఘంతో సంబంధమున్నవాళ్ళు వచ్చి బాలమ్మను చూసి, కొద్దిసేపు ఉండి శంకరయ్యను పక్కకుతీసుకపోయి

123

"ఏంజేద్దాం?" అని అడిగారు.

శంకరయ్య మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు.

మల్లారెడ్డి గొంగడి సర్దుకుంటూ "పోయి అడుగుదాంపా. అడుగకుంటె ఇట్లనే అలుసైపోతది. ఇంతదాక ఏమిజేసినా, ఎట్లజేసినా ఎవలు అడుగలేదు, గను కనే ఇష్టమున్నట్టు నడిపిస్తున్నడు. ఎదురుపడి అడిగితె ఇంతదనుక అయ్యేదికాదు. ఇన్నిదెబ్బలు తగిలేయేకావు. అసలు ఇది ఊరా? పాడా? అని అడుగుదాంపా...." అన్నాడు.

సాకలి మైసయ్య కాల్చినచుట్టను ఆర్పేస్తూ పొగబయటికి ఊదుతూ "....మనం ఇద్దరం ముగ్గురంపోతె బాలక్కకు పట్టినగతే అయితది. ఇట్లపోతే లెక్కగాదు...." అన్నాడు.

"అవును అదిగూడ నిజమే" తెనుగు బాలయ్య కల్పించుకున్నాడు.

"మరెట్లజేద్దాం?" ఆ గుంపులో ఎవరో ప్రశ్నించారు.

"ఊర్లె అందరిని ఇసారిద్దాం. ఊరన్నకాడ మంచోళ్ళు ఉంటరు, చెడ్డోళ్ళు ఉంటరు.... గందుకనే అందరికి ఎరుకయితే మంచిగుంటది...." మైసయ్య అన్నాడు.

అందరి చెవులవేస్తే ఒకడు అటుపీకుతడు, ఒకడు ఇటుపీకుతడు. అదికాదు, ఇదిపోదు. పదిమందిల పాముసావది...." అన్నాడు మల్లారెడ్డి.

"బడితెకట్టె అందుకుంటె పాముగాదు, పాముఅయ్యగూడ సస్తది, నువ్వే మనుకుంటున్నవ్?" మైసయ్య.

"నేనుగూడ గదేఅనుకుంటున్న బడితెకట్టె అందుకోవాలని" అని మల్లారెడ్డి వత్తిపలికాడు.

"బడితెకట్టెతోని కొట్టాలనుకుంటె పసరుగూడ గావాలెగదా?"

"మైసయ్యకాక చెప్పింది నిజమే, ఏదిజేయాలన్నా పంగిగలువాలె. పంగి గలిస్తేనే పనయితది...." తెనుగుబాలయ్య తీర్పుచెప్పినట్టుఅన్నాడు.

ఆ అభిప్రాయంతో అక్కడి వాళ్ళందరూ అంగీకరించారు. రాత్రికి అంద రిని కలిసి, విషయంవివరించి, తప్పుఎవరిది? అనిప్రశ్నించి అందరిని కూడకట్టుకుని దొరవారిని నిలదీయాలని నిర్ణయించడం జరిగింది.

పక్కింటి నాగమణి గంజి కొంతతెచ్చి బాలమ్మకు తాగించి, పక్కనవుండి ఏమికావాలో కనుక్కుంటూవుంది.

శంకరయ్య ఆపూట బావికాడికి పోలేదు. ఇంట్లోనే ఆలోచిస్తూ జననాట్య మండలి పాటలు మననంచేసుకుంటూ కూర్చున్నాడు.

సంధ్యవేళ దాటింది. పశువులు కొట్టాలకుచేరుతున్నాయి. నారాయణ, శంకరయ్య బావివద్దకు వెళ్ళేసరికి ఉదయం జరిగినసంగతి తెలిసింది, దాంతో ఆలోచిస్తూ శంకరయ్య ఇంటికొచ్చాడు.

దీపం వెలుతురులో ఓ మూలపడుకున్న బాలమ్మ కనిపించింది. ఆ పక్కనే కూర్చున్న శంకరయ్య నారాయణనుచూసి 'నమస్తే'చేసి తల్లిదగ్గరికి తీసుకెళ్ళాడు. దీపంవెలుతురులో బాలమ్మకుతగిలిన దెబ్బలనుచూసి నారాయణ తల్లడిల్లిపోయాడు. కళ్ళల్లోకి కసి, కోపం, క్రోధం పొంగాయి. అయినా తమాయించుకున్నాడు.

శంకరయ్య, మైసయ్య, బాలయ్య మిగతా నలుగురైదుగురు ఊర్లో వీధి వీధి తిరిగి తెలిసినవాళ్ళను, జీతగాళ్ళను, కూలిపనిచేసేటోళ్ళను, దుడ్డె దుడ్డె పోరగాళ్ళను వాళ్ళను, వీళ్ళనుతీసుకుని స్కూలుకాంపౌండ్‌లో కైనీడకు కూర్చుండబెట్టారు.

యిగ అందరొచ్చినట్టే అన్నా...." అన్నాడు శంకరయ్య, నారాయణను ఉద్దేశించి

నారాయణ, మైసయ్యకు చెప్తున్న విషయంఆపి, వచ్చిన వాళ్ళను చూసాడు ఇరవై ఐదుమంది వరకు వున్నారు. అందులో చాలామంది యువకులు కనిపించారు.

కామ్రేడ్ నారాయణ గొంతుసవరించుకుని, పక్కనేవున్న రాయిమీదకూర్చుని "ఇట్లా మనం మీటింగ్ పెట్టుకోవడం ఈ ఊర్లె ఇదే మొదటిసారి అనుకుంట- ఇయ్యాల గాకున్నా ఇంక రెండురోజులకైనా ఇలాంటి మీటింగ్ పెట్టుకోక తప్పని పరిస్థితులను మన దశరథరామిరెడ్డి దొర కల్పిస్తున్నడు.... పదిహేను రోజుల కింద మొక్కజొన్నచేను బర్లుమేశినాయని కుర్మ వెంటయ్యను కొట్టిండు. ఎవరు ఎనక ముందు లేరని, దొరతోని పగపెట్టుకోవద్దని ఊకుంటిమి- అంతకుముందు బాయికాడ కోడిగుడ్లు పోయినయని జీతగాణ్ణి చెట్టుకుకట్టేశికొట్టె, అప్పుడు ఎవరన్న 'ఎందుకు కొట్టినవ్ పటేలా?' అని అడిగినమా- అడుగలేదు! మొన్నకిమొన్న బిడ్డపెండ్లికి అప్పుతీసుకపోయి ఇంతవరకు అన్నలులేదు, మిత్తిలేదని గేటుపెట్టి మాదిగ నాగయ్యను కొట్టినా ఏమనకపోతిమి- ఇయ్యాల కోడీ సచ్చిపోయిందంటే లేదు అమ్ముకున్నవని బాలక్కను కొట్టె, రేపు మైసయ్యనో, మల్లారెడ్డినో కొడుతడు, ఎల్లుండి ఇంకొకర్ని కొడుతడు ఇట్లా అదుపు, ఆజ్ఞలేకుంట ఇష్టమున్నట్టు, చీమునెత్తురులేనోళ్ళను కొట్టి నట్టు కొడుతనేవుంటడు, మనం వకుతనే ఉంటమా?...." అని ప్రశ్నించాడు.

"ఆఎన్కటి ఎడ్డికాలం బోయింది. తిడితెనెపడొద్దు- కొడితే ఎందుకు పడాలే?...." అన్నాడో యువకుడు.

"అవును నిజమే? తిడితెకూడ పడొద్దు.... కాని దొరచేతుల వందల ఎకరాల భూమి వుంది, పశువులున్నాయి, నాగళ్ళున్నాయి, ట్రాక్టరుంది, పైసవుంది...."

నారాయణ ఇంకేదో చెప్పబోయేలోగా ఇంకో యువకుడు అందుకుని

"అదికాదుసార్, ఆ భూమిల నాగలికట్టకుంటె ఎట్లపండిస్తడు? పశువుల తలుగులు ఇప్పకుంటె అవిమేతమేస్తయా? ట్రాక్టరు నడుపకుంటె నడుస్తదా?.... ముందుగాల మనం అంతా ఒక్కపట్టుగావాలె, ఒకణ్ణితంతుంటె ఒకడు దూరం దూరంకేలిపోతుంటడు...." అని అందరిని పరికించి చూసాడు- నారాయణ మనసులో తృప్తిగా నవ్వుకున్నాడు ఆ మాటలకు.

"అవునాౖ ఒకణ్ణొకడు ఇసారిచ్చుకోకుంట తిరిగినంతకాలం గట్లనేఉంటరు అందరు. ఒకసంఘంపెట్టుకోని, నలుగురుకూడి ఇసారిచ్చుకుంటే పనులయితయ్, ఊకనే కమ్మంటె అయితయా?...."అని అడిగాడు మైసయ్య.

శంకరయ్య వింటూకూర్చున్నాడు.

"అగ్లైప్పుడో మరి సంఘంపెట్టుకుందాం...." అన్నాడు ఆ యువకుడు.

"అందరి నోటినుంచి ఆమాట రావాలెగదా?" అందరినిచూస్తూ అన్నాడు నారాయణ.

"ఎవరిమనసుల ఏముందో చెప్పండ్రిమరి...." అన్నాడు మల్లారెడ్డి.

"మంచిగనే వుంటది" అనికొంతమంది- అస్సల్ సంఘంబెట్టాలె, సంఘం పెట్టుకునేదాక కాదు. అనికొంతమంది తమ అభిప్రాయాలుచెప్పారు.

"సంఘంఅన్నకాడ ఒకరు పెద్దఉండాలెగదామరి." శంకరయ్య అన్నాడు.

"నిజమె- ఒకరు అన్నివిషయాలు చూసుకునేటట్టుఉండాలే"అని "మైసయ్యను ఆ పనిలపెడితె మంచిగుంటదనుకుంట...." అన్నాడు నారాయణ.

"నాకైతే సమ్మతమే...." అన్నాడు తెనుగుబాలయ్య

"అందరికి ఇష్టమే...." అన్నాడు ఓయువకుడు అందరితరఫున మాట్లాడుతూ

మైసయ్యను దగ్గరికి పిలుచుకుని కూర్చుండపెట్టి "మైసయ్యనే అన్నీ చూసుకుంటడని ఊకోవద్దు, అందరు ఎవరిపని వాళ్ళు చేసుకుంటూపోవాలె, ఏదైనా

విషయముంటె, మంచిచెడ్డఉంటె మైసయ్యనుకలువాలె, మాట్లాడాలె, అందరిమాట తను ఇనాలె, తనమాట అందరుఇనాలే...." అన్నాడు నారాయణ.

"మరి రేపటిసంగతేందో మాట్లాడుండ్రి" గుంపులోనుంచి ఒకతనుఅన్నాడు.

"మన మైసయ్యకాకనే చెప్తడు ఏంచెయ్యాల్నో" అన్నాడు శంకరయ్య

మైసయ్య సర్దుకునికూర్చుని, కొంతసిగ్గుపడుతూ, అందరివైపు ఓసారిచూసి,

"రేపు పొద్దుగాల ఇక్కడ పున్నోళ్ళమేగాకుంట, ఇంకొంతమందిమి ఆడోళ్ళ, మొగోళ్ళము దొరబంగ్లకాడికిపోయి అడుగుతాము. అప్పుడు ఏమంటడోసూద్దాం. దానిమీదికేలి ఎట్లఅనేది మనంఆలోచనజేసి ముందుకుపోదాం" అన్నాడు.

ఆ పద్దతే అందరికీ నచ్చింది అట్లనేజేద్దాం, అట్లనేజేద్దాం అని అందరూ నారాయణకు చెప్పి ఎవరింటికి వాళ్ళు బయలుదేరారు. శంకరయ్య, మైసయ్య, నారాయణ, మల్లారెడ్డి ఇంకొద్దిసేపు చర్చించాక అక్కడ నుంచి బయలుదేరారు. నారాయణ ఆరాత్రే మరో ఊరికి ప్రయాణమయ్యాడు.

సారాదుకాండ్ల దొర పేరుచెప్పుకొని చెప్పిసారాతాగి, రేపు ఊరికి పోవడానికి గాను ఐదురూపాయలు దొర దగ్గర అడుక్కుందామని దొర బంగ్లకుపోతున్న తాగుబోతు మల్లిగానికి స్కూల్ కాంపౌండ్ నుంచి దుడ్డెదుడ్డె పోరగాళ్ళు, జీతగాల్లు ఎల్లడంచూసి, 'ఇదేందిరో....' అని కళ్ళు ఓసారి నలుసుకొని పరీక్షగా చూసాడు చూస్తేఏముంది?

"....అస్లెట్ల అయితది అడుగాలె, బరాబర్ నిలపెట్టి అడుగాలే, ఎగురుతే, దుంకుతే మందు మనదెగ్గర వుండెనెవుండే...."

ఇట్లా అనుకుంటూపోతున్నారు.

తాగుబోతు మల్లిగానికి గుండెజల్లుమన్నది "....అయ్యొఇదేదో మునుకొచ్చె టట్టేవుంది.... ముండ కొడుకులు మీటింగ్ పెట్టినట్టేవుంది.... జెల్దిపోయి దొర శెవుల ఏసి ఇనాం అడుక్కుంట' అనుకుని తన ఉనికిని తెలియజేసేలా గొంతు సరాయించు కుంటూ, దగ్గుతూ వారివెంట నడుస్తున్నాడు.

తాగుబోతు మల్లిగాని గొంతుచప్పుడు వినగానే అందరూ మాటలు బంద్ జేసి ఏమీ తెలియనట్టుగా ఎవరి దారినవాళ్ళు చీకట్లో కలిసిపోయారు.

127

దమ్ముపట్టి వచ్చిన మల్లిగాన్ని చూసి దొరవారు

"ఏందిరా? గట్లఉరుకొస్తున్నవ్?.... అః ఏంది. ఏమైంది?" అడిగారు.

తాగుబోతు మల్లిగాడు దొరవారి చెవిలో తానుచూసింది, చూడంది, ఒకటికి రెండు కల్పించి చెప్పాడు.

దొర మొఖంలో కొంత ఆందోళన కనిపించింది. కనుబొమలు ముడిపడ్డాయి. కాని ఎంతోసేపు అవి ముడిపడిలేవు.

ఓక్షణం తర్వాత దొర కాలుమీద కాలు వేసుకుని

"ఏజేస్తర్రా ఆళ్ళు దద్దమ్మలు.... మీరంత ఎందుకున్నర్ రాపురి నాదగ్గర గిసుంటి పక్తలనేగద మీతోనిపని.... నువ్వేమి గాబరపడకు రేపయితే తయ్యార్గ వుండు...." అని మరో మాట మాట్లాడకుండా మల్లిగాడు పైసలు అడిగేందుకుకూడ వీలులేకుండా ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

తాగుబోతు మల్లిగాడు ఊరికిపోయే కార్యక్రమం మానుకుని ఇంటిదారిపట్టాడు.

శంకరయ్య ఇంటికిచేరేసరికి అప్పటివరకు కూర్చున్న నాగమణి తనఇంటికి వెళ్ళిపోయింది.

తొలికోడికూసింది. గోరుకోయలు కనిపించకుండా అయ్యాయి. పడమరన చందమామ కనిపించి కనిపించనట్టుగున్నాడు. ఆ కొద్దిసేపటికి ఊరు ఊరంతా మేల్కొన్నది.

చాలామంది జీతగాళ్ళు, రైతులు బావులకాడికిపోలేదు. చెల్కలకు ప్రయాణం కాలేదు. చుట్టలుకాలుస్తూ చూరులకింద, అక్కడ ఇక్కడ కూర్చున్నారు.

మైసయ్య ఇంకోఇద్దరు యువకులను వెంటవేసుకుని వీధి వీధితిరిగి అందరిని కామునికంత దగ్గరికి రమ్మంటూవున్నాడు. ఆడవాళ్ళు, మగవాళ్ళు, పిల్లలు, ముసలోళ్ళు అందరూ కామునికంతవైపు నడుస్తున్నారు. మైసయ్య బాలమ్మఇంటికొచ్చి బాలమ్మనులేపాడు. కొడుకు శంకరయ్య బుజంమీద ఓచేయి, తనబుజంమీద ఓ చేయి వేసుకుని మెల్లిగా కామునికంతకు నడిపిస్తున్నాడు మైసయ్య.

బాలమ్మనుచూస్తే ప్రాణంలేనిదానిలా అయింది. దారెమ్మటి ఆమెనుచూస్తూ అందరూ "అయ్యోపాపం"అని జాలిపడ్డారు.

బాలమ్మను ముందునడిపించుకుంటూ పోతూవుంటె వెనకాల కర్రలుపట్టుకుని యువకులు, గొంగళ్ళు బుజాలమీదవేసుకుని ముసలివాళ్ళు తలలమీదనుంచి కొంగు లేసుకున్న స్త్రీలు, బరిబాతలపిల్లలు నడుస్తూ దొర బంగ్లకుచేరారు.

గేటువద్దఉన్న కావలిముత్యాలు ఇంతమంది జనాన్నిచూసి నోరుతెరిచాడు. దొర బంగ్లకు ఇంత 'మందికూడి' ఎప్పుడురాలేదు. ఇంతమందిని ఒక్కసారి చూడగానే కళ్ళు చెదిరిపోయినయ్. అందరికన్నాముందు మెల్లిగానడుస్తున్న బాలమ్మను చూసి నాక "ఆ...., ఇదేదో పెద్దగనే అయేటట్టుంది" అనుకుని లోపలికిపోయాడు.

లోపలగచ్చులో స్నానానికి సిద్ధమయిన దొరదగ్గరికిపోయి కంగారుగా "ఊరు ఊరంత మన బంగ్లముందువొచ్చింది పటేలా...." అన్నాడు.

"రానీయరాదురా మనల్నేంపీకుతరు. నువ్వుపో. నీపనిసువ్ సూసుకోపో" అన్నాడు దశరథరామిరెడ్డి చెంబుతో తలపై వేడినీళ్ళుపోసుకుంటూ

కావలిముత్యాలు ముత్యాలుతోపాటు అంతవరకు ఇంట్లోనేవున్న తాగుబోతు మల్లిగాడు మరోఇద్దరు కట్టెలుపట్టుకుని సిద్ధమై బయటకు అరుగుమీదికొచ్చేసరికి జనం గేటుదాటి లోపలికివస్తున్నారు.

ఎవరైన ముత్యాలునుద్దేశించి "దొరవున్నాడుమామా?" అని అడిగాడు మైసయ్య

ముత్యాలు ఓపక్కకు నిలబడుతూ "ఉన్నడుబిడ్డా!" అన్నాడు. మల్లిగాడు మరి ఇద్దరుకూడా ఆపక్కన నిల్చున్నారు.

బాలమ్మను కింద ఓపక్కకూర్చుండపెట్టి నిలుచున్నారు మైసయ్య, శంకరయ్య, వాళ్ళదగ్గరలోనే కుర్మబీరప్ప, గొల్లమల్లయ్య, యువకులు, స్త్రీలు ఏదేదో మాట్లాడు కుంటూ నిల్చున్నారు.

ఆ కాంపౌండ్లో మట్టివాసన, చెమటవాసన, నిండిపోయింది. ఎవ్వరినోరు ఊరికేలేదు, అందరూ ఏదోఒకటి అంటూవున్నారు. మాటలసముద్రంలావుంది అక్కడ.

ఓ ఐదునిముషాల తరువాత దొరవారు తెల్లబట్టలేసుకుని, కిర్రుకిర్రుమని చెప్పులచప్పుడవుతుండగా బయటకొచ్చాడు. అంతమంది జనాన్ని చూసేసరికి కళ్ళు చెదిరాయి, ఎంతోమందిచేతుల్లో కర్రలు, మరెంతోమంది కళ్ళల్లోకసి. కోపం. ఇంకెంతోమంది నిలువెత్తు మండుతున్న ఆకారాలుచూసి ఒకింత గుండెజల్లుమన్నది. ఎంత ధైర్యంతెచ్చుకున్నా గుండెల్లో ఓమూలభయం, బుగులు పుడుతూనేవుంది.

129

అయినా తొణకకుండా బెనకకుండావచ్చి అరుగుమీద నగిషీలుచెక్కిన కుర్చిలో కూర్చున్నాడు అందరినిచూస్తూ

అంతవరకు లొడలొడమన్న నోళ్లన్నీ మూతపడ్డాయి. అంతా నిశ్శబ్దంగా నిల్చున్నారు. మెల్లిగా బాలమ్మ మూల్గులేవినిపిస్తున్నాయి.

మైసయ్య రెండుచేతులు జోడించి "దండంపటేలా...." అన్నాడు. మైసయ్య వెనకనిల్చున్న యువకులకు మైసయ్య మీద కోపమొచ్చింది దండంపెట్టినందుకు.

మైసయ్య పెట్టినప్పుడు తాము దండంపెట్టకుంటె మంచిగుండదని ఇద్దరు ముగ్గురు ముసలోళ్ళు చేతులుజోడిచ్చి "దండం పటేలా" అన్నారు. శంకరయ్య పటేలును మింగేసేటట్టు చూస్తూవున్నాడు.

దశరథరామిరెడ్డి చేతిగడియారం చూసుకుంటూ "దండం దండం" అని గొణిగాడు, దొరవారు తన మనుషులకు కనుసైగచేశాడు. అందరిని ఒకసారి చూస్తూ "ఏంసంగతిరా మైసయ్య అందరు కట్టగట్టుకొని ఒచ్చిండ్రు?...." అని తన దొర దర్పంతోనే అడిగాడు.

కావలి ముత్యాలు, మల్లిగాడు, మిగతాఇద్దరు అరుగుదిగి గేటువద్దకు నడిచారు.

"ఏముందిపటేలా.... బాలక్క గోససూడలేక, ఆగోస మీకు సూపిద్దామని తీసుకొచ్చినం...." అన్నాడు నెమ్మదిగా

మావోడు బాగనే మాట్లాడుతున్నడు అనుకున్నారు యువకులు

"నాకుసూపిస్తే ఏమొస్తదిరా, దాని పాపంఅది కుడుస్తున్నది. ఎవనిపాపానికి ఆడే బాధ్యుడైతడు గని ఇంకోడైతడా?"

"బాలక్క ఏంపాపం జేశింది దొరా నాకుతెలువక అడుగుత...." అని కుమ్మ వీరప్ప గొర్రెను అటకాయించినట్టు అడిగాడు,

"తెలువక ఎందుకడుగుతవ్‌రా, తెలిశె అడుగుతవ్, అడుగు...."

"తెలిశేఅడుగుతున్నడనుకుని చెప్పరాదుపటేలా" వెనకనుంచి ఎవరో యువకుడు

దశరథరామిరెడ్డికి అరికాలిమంట నరుగ్రిన నెత్తికెక్కింది.

"ఎవడ్రావాడు?...." అన్నాడు దొర.

"ఎవడైతే నీకెందుకు, నువ్ శెప్పేదేందో చెప్పరాదుపటేలా" ఇంకోయువకుడు

బాలమ్మ మూల్గుతూనేవుంది. శంకరయ్య తల్లిమీద ఎండపడకుండా చాటుగా నిల్చున్నాడు.

130

తొండముదిరి ఊసరెల్లి అయిందని దొర మనసులో అనుకున్నాడు. ఓక్షణం ఆగుంపువైపు తీక్షణంగాచూసి

"పంచాదు పెట్టుకుంతందుకు వొచ్చిండ్రా?" దొర

"మేం ఏంపంచాదు పెట్టుకుంటం పటేలా మీతోటి. బాలక్క తప్పేదో బాలక్క కొంగుల కట్టామని వొచ్చినం. ఎందుకు గంతగనం కొట్టిండో తెలిస్తే నలుగురం ఇంక నాలుగు ఆమె నెత్తిమీద ఏద్దామని వొచ్చినం...." మైసయ్య వ్యంగ్యంగా అన్నాడు.

దొరకు అర్థమయిపోయింది. మేకపోతు గాంభీర్యంతో

"అంత బందవస్తుతోటే వచ్చిండ్రిన్నమాట" అన్నాడు.

"ఇండ్ల బందవస్తు ఏముంది పటేలా? కత్తులు కటార్లు తీసుకొచ్చుకున్నామా? ఏమన్ననా?...." అన్నాడు గొల్లమల్లయ్య

"ఓహో.... కత్తులు కటార్లకాడి కొచ్చిందన్న మాట కత....?

ఎవరో ఏదో సర్దిచెప్పబోయారు. దొరనే అడ్డుపడి

"మీసంగతేందో నేను తర్వాత జూసుకుంటగాని...." ఏదో చెప్పబోయాడు. "ఆ సూసుకునేదేందో ఇప్పుడే సూసుకోరాదు పటేలా. మీలకిట్లనే వున్నంగా...." అన్నాడు ఓ యువకుడు. మైసయ్య అడ్డుపడి "దొరని చెప్పనియ్య రాదుండ్రి...." అన్నాడు. దాంతో జనంలో కొంత చప్పుడు తగ్గింది.

దొర చెప్పడం ప్రారంభించాడు.

"కోడిని బటాయికిచ్చిన...." ఎవరో కిసుక్కున నవ్వారు. ఆ తరువాత దొర అటుఇటు కోపంగచూసి తిరిగి ప్రారంభించాడు "....బటాయికిచ్చిన కోడి భయంతోని సూసుకోవాలెగద. సూసుకోలేదు. పిల్లలు రోగమొచ్చి సచ్చినయని తీసుకొచ్చింది. తల్లికోడిని తీసుకరాలేదు, ఆకోడిని ఏడనో అమ్ముకుని మెల్లిగ నాదగ్గరికొచ్చింది. కోడిని బటాయికిఇస్తే ఇంక రెండుకోళ్ళు ఎక్కువొస్తయనుకుంటె ఉన్న కోడిని ఊడ్సుకతిన్నది. గట్ల ఊడ్సుకతింటె కోపంరాక ఏమొస్తది?...."

"కోడిని ఊడ్సుకతింటె జుల్మాన ఎయ్యసుంటివి. నీఇష్టమున్నట్టుకొడ్తవా?" అన్నాడు యువకుడు

'ఎక్కడి నుంచి వొచ్చింది ఇంత ధైర్యం ఈ ముండకొడుకులకు? చాల చాల నీల్గుతున్నరు. గత్తరలేశినట్టు లేశిందేమి' అనుకున్నాడు దొర. ఊరి ప్రజల పరివర్తనకు చిరెత్తుకొచ్చింది. 'వేతెడంతలేని ముండాకొడుకులు తన అధికారాన్నే ఎదిరిస్తున్నారని మండిపడ్డాడు. కిందకూర్చున్న బాలమ్మమీద విపరీతమైన కోపం

వచ్చింది. ఎవ్వరు లేకుంటే తన్నితగిలెయ్యాలన్నంత మంటగావుంది. ఆఖరికి మన నంతా కరాచికలపై మొండికెత్తాడు దొరవారు.

"అవునుకొట్టినరా ఇప్పుడేంది?" అన్నాడు.

"ఈకొట్టుడు, కోదండంఎక్కిచ్చుడు ఇయ్యాలకొత్తగరాదు ఈ బంగ్లకాడ. అవన్ని అట్లనడిశిపోయినయ్, చెలాంచిపోయింది. యిగ ఇప్పటినుంచి అసుంటిదేం నడువది. ఎవడన్న తప్పుజేస్తే నలుగురినిపిలిచి కాదనిపియ్, అంతేగాని కొట్టేదిలేదు. బాలక్కనుకొట్టినందుకు తప్పయిందని ఒప్పుకోవాలే, దండుగతీసుకున్న పైసలు తిరిగిచ్చెయాలె!...." అన్నాడు మైసయ్య దొరను, జనాన్నిచూస్తూ

దశరథరామిరెడ్డి గుండె ఆగినంతపనయింది. కళ్ళల్లో జీవంలేకుండపోయింది, నాల్కెపై తడారిపోయింది, మనసునిండాభయం, మెదడు పనిచేయకుండాపోయింది. కొద్దిసేపుతరువాత తేరుకుని

"తప్పయిందని ఎందుకు ఒప్పుకుంటరా? తప్పుచేస్తేకదా? నేనుఒప్పుకోను ఏమిచేసుకుంటరో చేసుకోపోండ్రి...." అని కుర్చిలోంచి లేచాడుదొర

వెంటనే అరడజనుమంది యువకులు అరుగుమీదికి పరుగుదీసారు. గందర గోళం ఎక్కువైంది. కొట్టుండ్రి, తన్నుండ్రి, గుద్దుండ్రి, బయటకు గుంజుండ్రి అన్న కేకలతో ఆ కాంపౌండ్ నిండిపోయింది.

కాని ముందుగా అనుకున్నప్రకారం జీతగాళ్ళు, కావలిముత్యాలు మల్లిగాడు మరిఇద్దరు దొరనువిడిపించేందుకు ముందుకు రాబోయారు యువకులు అడ్డుపడి బరిసె కర్రిలాక్కొని కర్రిలనువిరిచేసి బయటకు తీసుకపోయి కొంతమంది వాళ్ళనుపట్టు కుని అక్కడేవున్నారు. మిగతాజనం అంతా ఎవరికి తోచినట్టు వాళ్ళు తిడుతూ, శాపనార్థాలుపెడుతూ వున్నారు. అరుగుపైజనం ఎక్కువైయారు. కర్రిలు ఎక్కువగా కన్పిస్తున్నాయ్.

దశరథరామిరెడ్డి పుట్టిపెరిగిననుంచి ఇలాంటిదినాన్ని చూడలేదు. ఇంతధైర్యం ప్రజలకుంటుందని అనుకోలేదు. ఎప్పుడూ కుక్కినపేనుల్లా పడివుంటారను కున్నాడు. ఆ కేకలు, అరుపులు, కర్రిలు, మొఖాలు, చూపులు చూసేసరికి చెమటలు పట్టాయి. దాంతో ప్రాణభయం ఎక్కువైంది. ఆదుకునేవారు ఎవ్వరూలేరు. పంతా లని వదిలిపెట్టి తప్పయిందని ఒప్పుకుంటేనే ప్రాణందక్కేట్టువుందని గ్రహించి, క్షమాపణ చెప్పుకునేందుకు మానసికంగా సిద్ధమయ్యేసరికి మొఖంలో కళ పూర్తిగా

లేకుండాపోయింది. ఆ దొరదర్పం నశించిపోయింది. ఆ అహంకారం, అధికారం నల్లగామాడిపోయి మొఖంమీద తేలిపోయాయి.

ఇంకా ఎక్కువమంది అరుగుమీదికి రాకముందే

"సరే తప్పయిపోయింది. ఇంకముందు ఎవర్నికొట్ట" అని జేబులోంచి ఇరవైరూపాయల నోటుతీసి మైసయ్యచేతిలోపెట్టి, కళ్ళల్లో నీళ్ళుతిరుగుతుండగా ఇంట్లోకి పోయారు దొర దశరథరామిరెడ్డి. తరతరాలనుంచి ఎప్పుడూ తప్పయిందని తాము ఒప్పుకోవడమేగాని, దొరవారు యింతవరకు ఏరోజూ ఒప్పుకోలేదు. కాని ఈ రోజు ఒప్పించేట్టు చేశామన్న ఉత్సాహంతో, సంతోషంతో యువకులు ఈలలువేస్తూ ముసలివాళ్ళు నవ్వుకుంటూ, స్త్రీలు ముక్కులమీద వేలేసుకుంటూ, బరిబాతల పిల్లలు ఆడుతూ దొర బంగ్లగేటుదాటారు.

అప్పటికి తొలికోడికూసి రెండు జాముల పొద్దయింది. ఎండమెరుస్తావుంది- ఆ గుంపులో తిరిగి బాలమ్మనే ముందునడుస్తావుంది కొడుకుసహాయంతో-

---

మనవి

విప్లవ రచయిత చెరబండరాజు 'గంజినీళ్ళు' అనే నాటిక రాతప్రతి ఎక్కడా దొరకలేదు. చెర ఎవరికో మిత్రులకి ప్రదర్శన కోసం ఇచ్చాడు. ఈ రాతప్రతి ఎవరిదగ్గరఉన్నా దయచేసి సంగ్రామ్ : ఎల్. బి. యస్. నగర్, చీరాల. కు పంపవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

త్రిపురనేని మధుసూదనరావు
కార్యదర్శి
విప్లవ రచయితల సంఘం.